# అందం

రచన;
జ్యోత్స్న

అది సాయంత్ర సమయం సూర్యుడు భూగర్భంలోనికి ప్రవేశిస్తూ చీకటికి తావు ఇచ్చుచున్నాడు. ఆహారం కోసం అనేక ప్రాంతాలకు పోయిన పక్షులు అప్పుడే వాటివాటి గూళ్ళకు చేరుకొంటున్నాయి. కార్యాలయాల లోను, కార్యక్రమాలలోను పని ముగించుకున్న జనం వస్తున్నారు.

సరోజ పార్కులో ఒకమూల కూర్చుంది.

నిన్నటివరకు ఆమె స్థలములో ఒంటరిగా కూర్చోలేదు.

ఆశలు రాశులుగాపోసి ఆపై కోర్కెల అందలంమీద కొలువుదీరి కన్నెమనసు కలలుగంటున్న వయసులో..... నా కమ్మటి కలలు సర్వనాశనం అయిపోయినాయి. నందనవనంలో మందారసుమంలా నా జీవితం పరిమళించే తరుణంలో కోర్కెల కొండమీదనుంచి అశాంతల అగాధంలోనికి నెట్టివేయబడింది తను.

ఆకాశంలో నల్లని మేఘములు గుంపులు గుంపులుగా సమావేశమవుతున్నాయి. మబ్బులను పర్యవేక్షణ చేస్తూ మధ్య మధ్య గర్జిస్తున్నాడు మేఘుడు. ఎంతో ఆత్రుతతో నిరీక్షిస్తున్న ఆత్మీయుడు ఒక్కసారి కనిపిస్తే కలిగే ఆనందానుభూతిలా మేఘములు ఆప్యాయంగా కౌగలించుకుంటూ, మెరుపుల వెలుగుల్ని కుమ్మరిస్తున్నాయి. ఆకాశంలోని హడావుడిని గమనించిన వాయుదేవుడు సంగతేమిటో తెలుసుకొందామని ఆసక్తిగా పరుగులు తీస్తున్నాడు. చిన్నవి, పొన్నవి చినుకులు చిద్విలాసంగా భూమిపైకి దూకుతున్నాయి.

సరోజ తన ఆలోచనలను కట్టిపెట్టి లేచింది. రోజూ ఆమె చేతిని అందుకునే చేయి ఆ రోజు లేదు,

ఆమె వడివడిగా నడుస్తుంది. ఒకనాడు. ఈ ప్రపంచానికి మనుషులు శాశ్వతంకాదు. నలుగురూ మెచ్చే మనుగడే నరుని జన్మకు సౌరభాన్ని సార్థక్యాన్ని ఇస్తుంది. చీమా, దోమా, పురుగు, పుట్రా లాంటి క్రిమి కీటకాదులు, పశు, పక్ష్యాద్యులు ఈ భూమిమీద తమ బ్రతుకును సాగిస్తున్నాయి కాని మనిషికి ఇతరులకు వ్యత్యాసంలేని ఈ బ్రతుకు ఎందుకూ? ఉన్న బ్రతుకుకి ఒక్క సిరే ప్రధానమని భావించను నేను. నీకు ఆస్తి లేనంతమాత్రాన ఏమైంది. ధనం కంటె మించిన అందం వుంది చాలదూ. తన ముంగురులు సవరిస్తూ అతడన్న మాటలు ఆమె చెవుల్లో గింగురుమంటున్నాయి.

వర్షం పెద్దదిగా కురవటం మొదలెట్టింది. ఆమె ఖాళీగా పోతున్న రిక్షాను ఆపి అందులో ఎక్కి ఇంటికి చేరింది. నిస్సహాయతా, నీరసంతోటి తన రూములోనికి రాగానే మంచంమీద పడుకుంది. కాని ఆమె మెదడు మాత్రం గతంలోనికి ప్రవేశిస్తూ ఉన్నది. ఆమె ప్రమేయము లేకుండానే ఆమె చెయ్యి డైరీని అందుకొంది. కళ్ళ ముందు పేజీలు గిరగిరా తిరుగుతున్నాయి.

14-1-72

తెల్లారింది. శీతాకాలం మధ్యరోజులు విరగదీసుకొంటున్న తెల్లనిలోకం మంచు దుప్పట్లు కప్పుకున్న ముద్ద బంతిపూలమీద మంచుబొట్లు అల్లుకొంటున్నాయి. క[illegible] పిల్లలు పట్టు పరికిణీలు కట్టుకొని గొబ్బెమ్మలమీద బ[illegible] రేకులను గ్రుచ్చి ముగ్గుల మధ్య అందంగా అమరుస్తున్నారు. లేగదూడలు ఎగుర్తున్నాయి. ఈ ప్రకృతే ఇంత ఆనందాన్ని కలిగిస్తే ఊరు వెలుపలి ప్రకృతి ఇంకెంత ఆనందాన్ని కలిగించాలి. ఈ రోజు సాయంత్రం తప్పకుండా ఊరి బయటకు పోవాలి అనుకొన్నాను.

అది సందెవేళ వినూత్న కాంతిని విరజిమ్ముతూ సూర్యుడు గగనభాగంలో పశ్చిమదిశ చేరాడు. ఆకాశ వీధిలో కొంగ్రొత్తదారులు ఏర్పడినాయి. గానప్రవీణులకుకూడ రాని రాగముల నాలపిస్తూ ప్రక్కనవారు స్రవంతి వీనుల కానందాన్ని చేకూరుస్తుంది. చంద్రుని రాకకై నిరీక్షిస్తున్న కోమలాంగులు చంద్రుని ఆగమనం గాంచి కొంత సంతృప్తిని చెందుతున్నారు. చల్లని మంద మారుతము వీస్తూనే ఉన్నది. నలువైపులా మేఘాలు క్రమ్ముకున్నాయి. శశికాంతు డగుపడి, అగపడనట్లుగా మేఘాలచాటున దోబూచులాడుచున్నాడు. మేఘాల బారినుండి తన్ను రక్షించమని చంద్రుడు వాయుదేవుని ప్రార్థిస్తున్నాడు. దూరంగా కమ్మనిపాట వినవస్తుంది. వినివీనులకు విందై నూతనోత్సాహాన్ని కూరుస్తుంది. ఆ గానం వచ్చే దిక్కుగా నడవటం మొదలెట్టాను. ఎంత మధురమైన గానము మానవోన్నతని చాటు మధురమైన గీతము, ఎంత తీయని కంఠము, అతని దగ్గరకు సమీపించినాను. కంఠ మాధుర్యముతోపాటు అతని రూపంకూడా హృదయాన్ని ఆకట్టుకుంది. ఆ అతని పరిచయాన్ని పెంచుకోవా అనిపించింది. పుటలు తిరుగుతున్నాయి.

25-3-1972

నేను అనుకొన్నట్లే అతనితో పరిచయం పెంచుకున్నాను. ఇన్నిరోజుల మా పరిచయం ఎన్నో క్రొత్త మలుపులు తిరిగింది. ఆ రోజు సాయంత్రం అతడు ధనం

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

మీద చెప్పిన అభిప్రాయం నాకెంతో నచ్చింది. రేపే అతనికి నా అభిప్రాయాన్ని చెప్పాలి.

26-4-1972

ఇన్ని రోజులు నన్ను పీడించిన జ్వరం నేటితో తగ్గిపోయింది. రేపు సాయంత్రం అతనితో నేను చెప్పాలనుకొన్న అభిప్రాయాన్ని చెప్పివేయాలి. జ్వరం నాలో తెచ్చిన మార్పును చూచి అతడేమనుకుంటాడో? అతనివి ఉన్నత ఉద్దేశ్యాలు కనుక నన్ను తప్పక స్వీకరిస్తాడు.

27-4-72

ఇన్నిరోజుల తర్వాత కలిసిన నన్ను ఎంతో ఆప్యాయంగా చూస్తాడని నాలోవచ్చిన మార్పుకు జాలిపడతాడని అనుకోన్నాను. కాని అంతా వ్యతిరేకమైంది. నన్ను చూడగనే అతని కళ్ళలో దోక్యమైన అసహ్యానికి నా మనస్సు చివుక్కుమంది. అయినా తెగించి నా అభిప్రాయం చెప్పాను. నా అభిప్రాయాన్ని విన్న అతడు నావైపు ఒకసారి చూచి సరోజా నాకు ఎన్నో ఆశలున్నాయి, ధనం లేకపోయినా అందమైన భార్యను పెళ్ళి చేసుకోవాలని, నా భార్య అందాన్ని చూచి, అందరూ ఈర్ష్యపడాలని, ఈ నా ఆలోచనా స్వార్థాన్ని కోరుతుండవచ్చు కాని నేను దీన్ని మార్చలేను. నీ అభిప్రాయాన్ని వ్యతిరేకరిస్తున్నందుకు క్షమించు అని చెప్పేసి వెళ్ళిపోయాడు. అతన్ని ఆదర్శవ్యక్తిగా భావించినందుకు ఇప్పుడు సిగ్గుపడుతున్నాను. అయితే ఇన్ని రోజులు అతడు నన్ను కాక నా అందాన్ని ప్రేమించాడన్నమాట. కాదు అతడు ఇప్పుడు భ్రమపడుతున్నాడు. నేను లేకుండా ఉండగలడా? రేపు రాకపోతాడా? రేపు పోవాలి తప్పక వస్తాడు.

డైరి చదవటం పూర్తి చేసి, సరోజ వ్రాయటం మొదలెట్టింది.

28-4-1972

అతడు తప్పక వస్తాడని ఎంతో ఆశతో పోయాను ఆశ నిరాశ అయింది.

ఓ భగవంతుడా!

అందాన్ని సృష్టించేవు సృష్టికోసం! బాగుంది కాని ఇంత పిచ్చిగా, బలంగా ప్రేమించే ఆరాధించే హృదయాన్ని ఎందు కిచ్చినావు? ఈ ప్రేమను జీవితాంతం వరకు మరచిపోనీయకుండా చెరగని ముద్రలా చిత్రించుకొనే అందాన్ని ఎందుకు సృష్టించావు? మరి నా జీవితాన్ని ఇట్లా ఎందుకు చేశావు. సరోజ ఇంక వ్రాయలేకపోయింది, డైరీ మూసేసింది.

# కార్మికుడా!

రచన : శ్రీ కె. నారాయణస్వామి

ఉదయ భానుని కిరణములతో
నడివడిగ నిద్ర లేచి
బరువెక్కిన హృదయముతో
పయనమయే కార్మికుడా !
కర్మాగారపు యంత్రములో
కాయమంతా వృథా చేసి
దిగజారిన నడుములతో
కడుపడలిన ఎముకలతో
అణగారిన గుండెలలో
చెలరేగిన జ్వాలలతో
నిర్భేద్యపు రేయివరకు
కష్టించిన ఫలముకొరకు
కారునీటి మబ్బులకై
బీడువడిన భూమివలె
కఠినాత్ముల కరుణలకై
కాచియుండు కార్మికుడా !
పూవులలో మకరందము
తుమ్మెదలే గ్రోలునట్లు
నీ మేనుల మాధుర్యము
నీ నాడుల నవరక్తము
యజమానులు గ్రోలినను
నిస్సారము చేసినను
నిష్కలంక ప్రేమలతో
నిర్జీవపు బ్రతుకలతో
పనియంతయు నీదియైన
ఫలితమంత వారికిచ్చి
పారవేసిన మెతుకులనే
పరమాన్నమని గ్రహించిన
నీవేనోయ్ మానవుడవు !
నీవేనోయ్ మాధవుడవు !